క్లుప్తంగా

బూచేపల్లి ప్రత్యేక పూజలు



ఆకుపూజ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: మండలంలోని రాజంపల్లి మూసీ నది ఒడ్డున శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామికి ఆకుపూజ చేశారు. ఈ సందర్భంగా హాజరైన వెంకాయమ్మకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఐదు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు.

మద్దిశెట్టి శ్రీధర్ ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

దర్శి: మండలంలోని రాజంపల్లి శ్రీప్రసన్నాంజనేయ స్వామి పూజా కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్ శుక్రవారం హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి రాజంపల్లి తిరునాళ్లకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

పెద్దారవీడు: మండలంలో దేవరాజుగట్టు పోలీసుస్టేషన్ ఎదురుగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు శనివారం ఉదయం 10 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలిరెడ్డి కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి

గిద్దలూరు రూరల్: తల్లులు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, తల్లులు, పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కస్తూరిబాలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు: స్థానిక కస్తూరిబా పాఠశాలలో నూతన విద్యా సంవత్సరంలో ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజిత తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియెట్ బైపీసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఏప్రిల్ 20 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనాథలు, బడి మానేసిన పిల్లలు, బడి బయట పిల్లలు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలను 95158 38862, 95153 22063 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

తాళ్లూరు: మండలంలోని పది పరీక్ష కేంద్రాలను ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. బొద్దికూరపాడు, తూర్పుగంగవరం, తాళ్లూరులలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించి పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఓలు, చీఫ్‌లతో చర్చించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చెయ్యాలని సూచించారు. అవసరమైన బందోబస్తు అందిస్తామని చెప్పారు.

తాళ్లూరు పీహెచ్‌సీ రెండో వైద్యుడిగా రాజేష్

తాళ్లూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండో వైద్యుడిగా సి. రాజేష్ యాదవ్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ హనుమా నాయక్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు బదిలీపై వెళ్లారు. బద్వేల్‌లో పనిచేస్తున్న డాక్టర్ రాజేష్ బదిలీపై ఇక్కడకి వచ్చినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా శ్రీనివాసరావు

తాళ్లూరు: తాళ్లూరు ఇన్‌చార్జి ఎంపీడీఓగా వి.శ్రీనివాసరావును నియమిస్తూ జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ బి.జాలిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రూప్-1లో రిక్రూట్‌మెంట్‌లో ఎంపీడీఓగా సెలక్టయి విధులు నిర్వహిస్తున్న కె.యుగకీర్తికి ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు ఈటీసీ బాపట్లలో వృత్తి పరమైన శిక్షణ ఉండటంతో కార్యాలయ పర్యవేక్షకుడు వి.శ్రీనివాసరావుకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

● మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమం నిర్వహణపై నియోజకవర్గ స్థాయి సచివాలయాల కన్వీనర్లకు ఆయన దిశానిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులకు ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా కన్వీనర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని, సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన గృహసారథుల సాయంతో గడప గడపకు వెళ్లి పథకాల గురించి వివరించాలన్నారు. నియోజకవర్గంలో దాదాపు 75 వేల గడప గడపలు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోందని, ఏ ఒక్క గడప వదల కుండా వెళ్లి ఆ ఇంటి యజమానితో మాట్లాడాలని మంత్రి ఆదేశించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతం అయ్యే విధంగా సచివాలయాల కన్వీనర్లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, గృహసారథులు చూడాలని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, ఆయా మండలాల పార్టీ మండల అధ్యక్షులు కె.ఓబుల్‌రెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, పి.కృష్ణారెడ్డి, జి.రమణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్లు సయ్యద్ జబీవుల్లా, ఎల్లారెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి మంత్రి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సురేష్, విశాల్

యర్రగొండపాలెం: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం స్థానిక పుల్లలచెరువు రోడ్డులో నివాసం ఉంటున్న రామావత్ బాలిబాయి ఇంట్లో గ్యాస్ లీకై గృహం పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనలో ఆమె కుటుంబం కట్టుబట్టలతో మిగిలిందన్న విషయాన్ని మంత్రి తెలుసుకొని అక్కడికి వెళ్లారు. కాలిపోయిన ఇంటిని, వస్తువులను పరిశీలించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి ప్రభుత్వ పరంగా అందాల్సిన పరిహారాన్ని తక్షణమే అందేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద మంత్రి రూ.20 వేలు తన తనయుడు, జార్జి విద్యా సంస్థల చైర్మన్ ఆదిమూలపు విశాల్ చేతులమీదుగా అందజేశారు. ఎంపీపీ కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ విజయభాస్కర్, మండల పార్టీ కన్వీనర్ కె.ఓబుల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలచెన్నయ్య, సర్పంచ్ అరుణాబాయి, పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ షేక్ ఖాశింబాషా పాల్గొన్నారు.

మారెళ్లలో వడగండ్ల వాన

ముండ్లమూరు: మండలంలోని మారెళ్ల గ్రామ పరిసర ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. సాయంత్రం ఒక్క సారిగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వాన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో వడగండ్లు పడటంతో వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. మిరప రైతులు కళ్లాల్లో ఆరబెట్టిన పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు

బేస్తవారిపేట: పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకుని సాధించేందుకు పట్టుదలగా కష్టపడాలని సూచించారు. పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

ముండ్లమూరు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ అవుల సునీత అన్నారు. స్థానిక ఆ పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థినులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే తల్లిదండ్రులకు మనపై గౌరవం పెరుగుతుందన్నారు. ఉన్నత లక్ష్యంతో చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు రత్నమాలినీదేవి, చంద్రకళ, ప్రియదర్శిని, నాగలక్ష్మి, సునీత, కృష్ణకుమారి, స్వర్ణ పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరి

తాళ్లూరు: పీఎం కిసాన్ వైఎస్సార్ రైతు భరోసా నగదు జమకు ఈ-కేవైసీ తప్పనిసరని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మన్నేపల్లి పంచాయతీలో శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో ఇంకా 1861 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉందని వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఓటీపీ ద్వారా ప్రక్రియ పూర్తి చేస్తారని చెప్పారు. వీఏఏ నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ

పెద్దారవీడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎం.నాసర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ రాజ్‌కుమార్ సెలవులు పెట్టడంతో దోర్నాల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న నాసర్‌రెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన్ను ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, ఎంపీటీసీ దుదేకుల పకీరయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కాసు వెంకటరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, అభినందించారు.

పేద ముస్లింలకు సహర్, ఇఫ్తార్ ఏర్పాట్లు

మార్కాపురం: రంజాన్ మాసంలో సహర్, ఇఫ్తార్ ఏర్పాట్లు చేసుకోలేని పేద ముస్లింలకు మాస్టర్ సోషల్ సర్వీస్ సంస్థ ద్వారా భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ నాయకుడు సయ్యద్ గౌస్ మోహిద్దీన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ సంస్థ ద్వారా గత కొన్నేళ్లుగా పేద ముస్లిం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సదుపాయాలు కావాల్సిన వారు 9247266858ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

గిద్దలూరు రూరల్: వాసవీ క్లబ్ రీజనల్ డైరెక్టర్ మాగులూరి శ్రీకాంత్, వనిత క్లబ్ ప్రెసిడెంట్ శేగు పద్మావతిల ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలకు ఉపయోగపడే అట్టలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వరశర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే అట్టలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వాసవీ క్లబ్ నిర్వాహకులకు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తాళ్లూరు: తళ్లపు రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు 450 మందికి పరీక్షల సామగ్రి అందించారు. ట్రస్ట్ ఫౌండర్ టి.ప్రశాంత్‌రెడ్డి, కో ఫౌండర్ టి.శివశంకర్‌రెడ్డిలు విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సుబ్బారావు, గోవర్దన్, అరుణకుమారి పాల్గొన్నారు.


ఎస్సై ముక్కంటికి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న సీఐ సుధాకర్ తదితరులు

తర్లుపాడు: తాడివారిపల్లి ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్తున్న ఎస్సై ముక్కంటిని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది, జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ సుధాకర్‌రావు మాట్లాడుతూ.. ఎస్సై ముక్కంటి సేవలను కొనియాడారు. సిబ్బంది ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ని ముక్కంటి అమలు చేశారని పొదిలి ఎస్సై నాగార్జున్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఇక్కడి ప్రజల సహకారం మర్చిపోలేనని ఎస్సై ముక్కంటి చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ పట్టాభిషేకం



మార్కాపురంలో శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం: పట్టణంలోని ప్రసన్నరామాస్వామి ఆలయంలో శుక్రవారం సీతారామచంద్రస్వామి వారి పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కళ్యాణం అనంతరం నిర్వహించిన పట్టాభిషేకానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మున్సిపల్ చైర్మెన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ దంపతులు, ఎస్వీకేపీ కళాశాల చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవస్థాన కమిటీ చైర్మన్ చక్కా మాలకొండ నరసింహారావు తదితరులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కొనకనమిట్ల మండలంలో..

కొనకనమిట్ల: శ్రీరామ నవమి వేడుకలను శుక్రవారం గొట్లగట్టు, పెదారికట్ల, నాయుడుపేట, నాగంపల్లి, సలనూతల గ్రామాల్లో వేడుకగా నిర్వహించారు. గొట్లగట్టులో గరుడ వాహనంపై సీతారామచంద్రుల ఉత్సవమూర్తులను ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఘనంగా ఆసరా ఉత్సవాలు

మార్కాపురం టౌన్: జగనన్న ప్రభుత్వంలో మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఎంపీపీ పోరెడ్డి అరుణచెంచిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని డ్వాక్రా బజారులో వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం రమేష్, కెనరా బ్యాంక్ మేనేజర్ మౌనిక, రేష్మి, వెలుగు సీసీ మనోకుమారి, స్త్రీనిధి మేనేజర్ సులోచన తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర, సరస్వతి విగ్రహాల ప్రతిష్ఠ



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సురేష్

మార్కాపురం: పట్టణంలోని డాక్టర్ శామ్యూల్ జార్జ్ ఇంజినీరింగ్ కళాశాలలోని గణపతి ఆలయంలో శుక్రవారం సరస్వతి దేవి, విఘ్నేశ్వర స్వామి విగ్రహాలు ప్రతిష్ఠించారు. పూజా కార్యక్రమాల్లో పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, కళాశాల సెక్రటరీ విశాల్, కళాశాల సాంకేతిక సలహాదారులు డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజబాబు, డీన్ మస్తానయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివితే కలెక్టర్ కావచ్చు

● సబ్ కలెక్టర్ సేథు మాధవన్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సేథు మాధవన్

మార్కాపురం: విద్యార్థి దశలో కష్టపడి చదివితే కచ్చితంగా ఐఏఎస్ సాధించి కలెక్టర్‌గా సేవలు అందించవచ్చని మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఎ-1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ మహోత్సవ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను బీటెక్ పూర్తి చేసి సివిల్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరారని, ఈ క్రమంలోనే యూపీఎస్సీ పరీక్ష రాసి ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యానన్నారు. మళ్లీ కష్టపడి చదివి ఐఏఎస్‌గా ఎంపికయ్యానని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఏ-1 కళాశాల చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మీర్జా షంషేర్ అలీబేగ్ మాట్లాడుతూ.. మూడు రోజులపాటు జాతీయ స్థాయి టెక్నికల్, కల్చరల్, గేమ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కిట్స్ కళాశాల చైర్మన్ అన్నా కృష్ణ చైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అతిథులను ఘనంగా సన్మానించారు.

గృహాలు తక్షణమే పూర్తి చేయాలి

కురిచేడు: మండలంలోని ఆవులమందలో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించారు. కార్యక్రమానికి హౌసింగ్ డీఈఈ నిరీక్షణరావు మాట్లాడారు. సచివాలయం పరిధిలోని 69 గృహాలు ఏప్రిల్ 15 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. హౌసింగ్ లబ్ధిదారులతో ఆయన ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలకు తగిన సూచనలు చేశారు. ఇప్పటికి బిలో బేస్‌మెంట్ లెవల్లో 26, బేస్మెంట్ లెవల్లో 20, రూఫ్‌లెవల్లో 5, రూఫ్ కంప్లీట్ 1, పూర్తయినవి 14, అసలు ప్రారంభించనివి 3 ఇళ్లు ఉన్నాయన్నారు. వాటన్నింటినీ పూర్తిచేయాలని సూచించారు. తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా, పంచాయతీ కార్యదర్శి నరేష్‌కుమార్, హౌసింగ్ వర్క్ఇన్స్పెక్టర్ మరియదాసు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు అభినందనలు



అభినందనలు అందుకుంటున్న లక్ష్మణరావు

ముండ్లమూరు: పదవీ విరమణ పొందిన ఆర్మీ జవాన్‌కు ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. మండలంలోని వేములబండ గ్రామానికి చెందిన మామిళ్లపల్లి లక్ష్మణరావు పద్దెనిమిది ఏళ్లు ఆర్మీలో ఉద్యోగం చేసి శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఆర్మీ జవాన్‌గా ఏడు సార్లు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసపత్రాలు, మెడల్స్ అందుకున్నారు. 2005లో మిలటరీలో చేరిన లక్ష్మణరావు ఢిల్లీ, అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్‌లో పని చేశారు. గుజరాత్ రాష్ట్రం బూజ్ జిల్లాలో పదవీ విరమణ సందర్భంగా ఉన్నతాధికారులు లక్ష్మణరావును ఘనంగా సన్మానించి అభినందించారు. లక్ష్మణరావు తల్లిదండ్రులు అంజమ్మ, వెంకటేశ్వర్లు, అన్నదమ్ములు రామారావు, శేషయ్య, కోటేశ్వరరావు ఆనందం వ్యక్తం చేశారు.

50 మంది పేదలకు వస్త్రదానం

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని కంభాలపాడులో శుక్రవారం షిరిడీ సాయిబాబా, పుటపర్తి సాయిబాబా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 50 మంది నిరుపేదలకు వస్త్రదానం చేశారు. గ్రామ పెద్దలు తల్లపురెడ్డి వెంకట నారాయణరెడ్డి, బసిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకుడు మంచికంటి ప్రసాదురావు తెలిపారు. ముందుగా షిరిడీ సాయిబాబా, పుటపర్తి సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: భవిష్యత్తులో రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడి క్యాంప్ కార్యాలయంలో మార్కాపురం, తర్లుపాడు మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ కార్యక్రమంపై సమీక్షించారు. ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకు ప్రతి గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులు సమావేశమై 7 నుంచి 14వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో పర్యటించే ప్రాంతాల షెడ్యూల్ పంపించాలన్నారు. గడిచిన నాలుగేళ్లలో జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించాలని ఎమ్మెల్యే సూచించారు. అబద్ధాలు చెప్పాల్సిన పనిలేదని, సంక్షేమం, అభివృద్ధి గురించి మాత్రమే తెలియజేసి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎంపీపీలు అరుణచెంచిరెడ్డి, భూలక్ష్మీరామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జె.శ్రీనివాసరెడ్డి, వేమారెడ్డి, గొట్టిపడియ చెన్నారెడ్డి, జంకె వెంకటనారాయణరెడ్డి, బుర్రి వెంకటేశ్వర్లు, ఎస్.వీరయ్య, తర్లుపాడు మండల కన్వీనర్ మురారి, జేఎస్‌డబ్ల్యూ కన్వీనర్ రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ, ధర్మకర్తలు

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 5 నుంచి 23వ తేదీ వరకు చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ నెల 6న (తెల్లవారితే శుక్రవారం) స్వామివారి కళ్యాణం, 15న రథోత్సవంతో పాటు వివిధ అలంకారాల్లో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పశుప్రదర్శన పోటీలు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ అర్చకుడు శ్రీపతి అప్పన్నచార్యులు, పి.చెంచిరెడ్డి, శేషు, కొండయ్య యాదవ్, అర్జునరావు, జి.చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మంత్రి సురేష్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

యర్రగొండపాలెం: రాష్ట్రంలో ఉన్న బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి ఆదుకోవాలని ఆ సంఘ నాయకులు శుక్రవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నివసిస్తున్న బోయ, వాల్మీకులు సమానంగా ఉన్నారని, అటువంటప్పుడు కొన్ని ప్రాంతాలకు చెందిన వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం తమకు బాధ కలిగిస్తోందన్నారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. వాల్మీకి, బోయ సంఘ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, వెంకట సుబ్బయ్య, పిక్కిలి శ్రీను పాల్గొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యత



రాయవరంలో నీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేపీ



పైప్‌లైన్‌కు భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కృష్ణ, కృష్ణమోహన్‌రెడ్డి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం తాగు నీటి సమస్య నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయవరంలో జల్ జీవన్ మిషన్ కింద రూ.49.49 లక్షల వ్యయంతో 60 వేల కిలోలీటర్ల ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కాపురం నియోజకవర్గంలో నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాయవరంలో 332 గృహాలకు తాగు నీటి సౌకర్యం కల్పించేందుకు 2.5 కి.మీ మేర పైప్‌లైన్ వేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన వాటర్ కనెక్షన్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణచెంచిరెడ్డి, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ దేవెండ్ల లక్ష్మమ్మ, సర్పంచ్ కోటయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ ప్రారంభం

పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎం.మల్లికార్జునరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, పట్టణ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, కౌన్సిలర్లు బుశ్శెట్టి నాగేశ్వరరావు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.5.30 కోట్లతో సాగర్ పైప్ లైన్

➤ మార్కాపురంలో 8 వార్డుల్లో పనులు ప్రారంభం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో సాగర్ పైప్‌లైన్ ఏర్పాటుకు ఇక్కడి సత్యనారాయణస్వామి గుడి వద్ద ఎమ్మెల్యే సోదరుడు, మాజీ వైస్ ఎంపీపీ కుందురు కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ శుక్రవారం భూమిపూజ చేశారు. పట్టణంలోని 27, 28, 29, 30, 31, 32, 33, 35 వార్డుల్లో రూ.5.30 కోట్ల వ్యయంతో పైప్‌లైన్ ఏర్పాటు చేసి కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కమిషనర్ గిరికుమార్, కౌన్సిలర్ షేక్షావలి, నగేష్, డీఈ సుభాని తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సేవలు వినియోగించుకోవాలి



ప్రయాణికులతో మాట్లాడుతున్న సీఐ భాస్కర్

గిద్దలూరు రూరల్: రైలులో ప్రయాణించే వారు రైల్వే సేవలు సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ఆర్పీఎఫ్ సీఐ వి.భాస్కర్ అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ప్రయాణికులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైలులో ప్రయాణించే వారు ఆభరణాలు ధరించి కిటికీల వద్ద కూర్చోరాదన్నారు. ప్రయాణించే సమయంలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే 139కి ఫోన్ చేయాలన్నారు. ఎస్‌ఐ అజిత, స్టేషన్ మాస్టర్ నాయబ్ రసూల్, ఎఫ్‌బీఓ రామకృష్ణ, ఏఎస్‌ఐ నాగలక్ష్మి, ఆర్పీఎఫ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.